# కాపీ

**- లలిత.ఎస్.**

''మమ్మీ, మమ్మీ, మరేమో నాకొక మంచి కథ చెప్పవూ? స్కూల్లో స్టోరీ రైటింగ్ కాంపిటీషన్ ఉంది'' పెద్ద పెద్ద కళ్ళను గుండ్రంగా త్రిప్పుతూ, స్పీడుగా మెట్లెక్కి వచ్చిందేమో, ఆయాసపడుతూ, చేతులు తిప్పుతూ అడిగింది, ఏడేళ్ళ లయ, తల్లి కావ్యని. లేడీస్ క్లబ్‌కి ప్రెసిడెంట్ కావ్య. ఆరోజు జరిగే సమావేశంలో లెక్చరుకి ప్రిపేరవుతోంది. ఎదురుగా డ్రెస్సింగ్ టేబుల్, మధ్య మధ్యలో తన ఫీలింగ్స్ చూసుకుంటూ, చీర సర్దుకుంటూ, మెళ్ళో వేసుకున్న నెక్లెస్‌ని సవరించుకుంటూ, రకరకాల భంగిమల్లో ఆమె ప్రాక్టీసు జరుగుతోంది. మధ్యలో లయ వచ్చి డిస్టర్బ్ చేసేసరికి చాలాకోపం వచ్చింది.

''స్కూల్‌కి పంపేది బుద్ధిగా చదువుకుని క్లాస్‌లో ఫస్ట్ రావటానికి కానీ, ఇలా కథలూ కాకరకాయలూ అంటూ ర్యాంక్ వెనక్కి వెళ్ళటానికి కాదు. ఫో, వెళ్ళి హోంవర్క్ చేసుకో'' గట్టిగా కసిరింది కావ్య.

ఆ చిన్నారి హృదయం విల విలలాడింది. తన కోరి కను కాదన్న తల్లివంక కోపంగా చూసి, డ్రాయింగ్ రూమ్‌లోకి వెళ్ళిపోయింది లయ. ఎలాగైనా తను చిన్న కథ వ్రాయాలి. లక్ష్మీ టీచర్ దృష్టిలో తను కూడా చాలా యాక్టివ్ అనిపించుకోవాలి. ఎప్పుడూ అన్నింట్లో ముందు ఉండే రోజీ, లతలను వెనక్కి నెట్టాలి. ఆ చిన్నారి హృదయంలో ఒక స్ట్రాంగ్ ఫీలింగ్ కలిగింది.

పోనీ, మమ్మీ చెప్పకపోతేయేం, డాడీని అడుగుదాం. అని సమాధానపడింది. కానీ డాడీ ఎప్పుడు కలుస్తారు? ఒక్కొక్కసారి అయితే వారం రోజులకు కూడా డాడీ కనిపించరు. ఏవిటి ఈ మమ్మీ, డాడీకి పనులు? ఎప్పుడూ బిజీనే. ఆ పసి మనస్సుకి సమాధానం లేని ప్రశ్నలు. లయకేమో ఎంచక్కా మమ్మీ, డాడీతో కలిసి షాపింగ్‌కి వెళ్ళాలనీ, సినిమాలకు వెళ్ళాలనీ ఉంటుంది. వాళ్ళకేమో ఇంటికి రావటానికే తీరికలేదు.

లయ మనస్సులో కథ వ్రాయాలన్న పట్టుదల చిన్నగా మొలకెత్తి, మహావృక్షమై కూర్చుంది. సాయంత్రం ఫ్రెష్‌అప్ కోసం వచ్చిన డాడీని చూసేసరికి, లయకి అంతులేని ఆనందం కలిగింది. లాన్‌లో బంతి ఆడుతున్నదల్లా పరిగెట్టుకుంటూ తండ్రి దగ్గరకు వచ్చింది. ''హాయ్ లయా హౌ ఆర్యూ?'' నాలుగు రోజుల తరువాత చూసిన కూతురిని, పలకరించాడు తండ్రి ప్రవీణ్. ''ఫైన్, డాడీ! డాడీ.. చిన్న రిక్వెస్ట్'' ఆశగా అడిగింది లయ.

''స్పీక్ అవుట్ బేబీ'' దగ్గరకు తీసుకుంటూ భరోసా ఇచ్చాడు.

''మరేమో, మా స్కూల్లో స్టోరీ రైటింగ్ కాంపిటిషన్ ఉంది. నాకు మంచి కథ చెప్పవూ. ప్లీజ్.'' తండ్రి నో అనకపోతే బావుణ్ణు అన్న ఫీలింగ్‌తో, ఆశగా ప్రవీణ్ మొహం వంకే చూస్తూ అడిగింది.

''ఓహ్! షిట్, స్టోరీనా? నేను ఇంకేదో అడుగుతావనుకున్నా. ఐ యామ్ సారీ బేబీ. నాకు స్టోరీస్ రావు'' తేలిగ్గా కొట్టిపారేశాడు. లయకి దుఃఖం పొంగుకొచ్చింది. ''ఛీ! నా ఇంట్రెస్ట్ ఎవరికీ అక్కరలేదు'' అనుకుంటూ, మౌనంగా మళ్ళీ లాన్‌లోకి వెళ్ళిపోయింది. లయలో నిముష నిముషానికి, కథ వ్రాయాలన్న పట్టుదల పెరుగుతోంది. ఎలాగైనా కథ వ్రాయాలి. తప్పదు. తను పోటీకి వెళ్ళాలి. తనకే ప్రైజ్ రావాలి. అది చూసి మమ్మీ, డాడీ గ్రేట్‌గా ఫీలవ్వాలి.

• • •

''నాయనమ్మా! నాకొక మంచి కథ చెప్పవూ?'' రాత్రి పడుకునే ముందు, నాయనమ్మని కూడా అర్థించింది లయ.

''ఏ కథ కావాలి. రామాయణమా, భారతమా, రాజకుమారుల కథలా? చెప్పు తల్లీ'' అంటూ, లయను తన వళ్ళో కూర్చోపెట్టుకుంది. ఆ పెద్దావిడ.

''అవేం వద్దు. నాకు మంచి కథ కావాలి. నాకే ప్రైజ్ రావాలి. ప్లీజ్ చెప్పవా?'' బ్రతిమాలుతున్న ధోరణి.

''అయ్యో! కథలకేం బోల్డు వచ్చు. అన్నీ పురాణాలు, ఇతిహాసాలే. నీకు నచ్చే కథ నేనేం చెప్పాలనే తల్లీ'' అంటూ లయ బుగ్గలు పుణికి పుచ్చుకుని ముద్దాడింది. లయకి మాత్రం చాలా రోషం వచ్చింది. వళ్ళోంచి దిగి బుగ్గలు రాసుకుంటూ ''మీరంతా ఒకటే. నేనెవరికీ అక్కరలేదు'' అంటూ గదిలోకి వెళ్ళిపోయింది.

'పిచ్చిపిల్ల! అమ్మా, నాన్న ఉన్నా, దాని ఆలనా, పాలనా చూడరు. తనేమన్నా చెబుదామంటే, కృష్ణా, రామా అంటూ కూచోక, ఇవన్నీ నీకెందుకు అంటారు?' అనుకుంటూ, మంచంమీద పడుకుని కళ్ళుమూసుకుంది.

లయ మాత్రం ఆలోచిస్తూనే ఉంది. అప్పటికే రెండు, మూడుసార్లు ప్రయత్నం చేసి, కాగితాలు ఖరాబు చేసింది. తనకే నచ్చలేదు. అప్పుడు గుర్తొచ్చింది వాళ్ళ కాలనీలోని 'చిల్డ్రన్స్ లైబ్రరీ' సంగతి. ఎలాగైనా రేపు వెళ్ళాలి. పాత కథలన్నీ వెతికి, మార్చి కొత్తగా వ్రాయాలి. ఎవరూ కో ఆపరేట్ చేయకపోతే ఏం చేస్తుంది? అభం, శుభం తెలియని ఆ పసిమనస్సు, తప్పు చేయడానికి శ్రీకారం చుట్టింది.


• • •

లయ చేతిలో వెండి కప్పు, తళ తళా మెరుస్తోంది. గంధం గిన్నెలా ఉన్న ఆ కప్పు అందుకుంటూంటే, ఆమె కళ్ళలో కోటి దీపాల కాంతి, మొహంలో అమాయకమైన చిరునవ్వు. చుట్టూ చప్పట్ల హోరు. ఎంత గర్వంగా ఫీల్ అయిందో. ప్రైజ్ గెలుచుకున్నానన్న సంతోషం, రోజీ, లతలను ఓడించానన్న ఆనందం, ఆమెని ఆఘమేఘాల మీద ఇంటికి తెచ్చాయి. అప్పటికి రాత్రి ఎనిమిదిన్నర అయింది. క్లబ్ నుంచి వచ్చిన కావ్య తాపీగా మేకప్ తీసేస్తోంది.

''మమ్మీ! నాకే ఫస్ట్ ప్రైజ్ వచ్చింది. కావాలంటే చూడు'' అంటూ కప్పు పట్టుకుని కావ్య ముందుకి దూకింది. ఒక్కక్షణం ఆశ్చర్యపోయి, ఆ వెంటనే తేరుకుని ''నీకెవరు చెప్పారు కథ? నిజం చెప్పు'' కళ్ళు పెద్దవి చేసి, చూపుడు వేలితో బెదిరిస్తూ, లయది ఒక భుజం పట్టుకుని, గట్టిగా అడిగింది. ప్రైజ్ చూడగానే దగ్గరకు తీసుకుని ముద్దుపెట్టుకుంటుందనుకున్న తల్లి బెదిరించేసరికి, లయకి కన్నీళ్ళ పర్యంతమే అయింది. అబద్దాలు అలవాటు లేని లయ ''కాపీ కొట్టాను మమ్మీ! లైబ్రరీలో పాత కథల పుస్తకంలో కథ మార్చి రాశాను'' నిజాయితీగా ఒప్పుకుంది.

''కాపీ కొట్టావా? ఇదేనా నీకు స్కూల్లో నేర్పుతు

న్నది? రాకపోతే ఊరుకోవాలి. అంతేకానీ తప్పుడు పని చేస్తావా? వేలెడంత లేవు ఇప్పట్నించి, అలాటి పనులు చేస్తావా?'' లయ కుడిచెంప మీద చెళ్ళుమని కొట్టింది. ఆ దెబ్బకి ''అమ్మా!'' అని అరచిన లయ గొంతు కింద రామాయణం చదువుకుంటున్న నాయనమ్మకు కూడా వినిపించింది. గబ, గబా అడుగులేస్తూ, ఆ పెద్దావిడ పైకి వచ్చింది. ''ఏం జరిగింది? ఎందుకలా కొడ్తున్నావ్?'' మనవరాలిని తన



వైపుకి లాక్కుంటూ కోడలివైపు కోపంగా చూస్తూ అడిగింది.

''ఆ ఏముంది? మీరిచ్చిన చొరవే. క్రమశిక్షణ అంటే, ముద్దు మురిపెం అని దాన్ని వెనకేసుకొచ్చారు. ఇవాళ ఎంతపని చేసిందో చూశారా? నేను నలుగురిలో ఎలా తలెత్తుకుని తిరిగేది?'' కావ్య సన్నాయి నొక్కులు నొక్కింది. ''ఏం చేసిందేంటి?'' అత్తగారు గట్టిగానే అడిగారు.

''కాపీకొట్టి, ప్రైజ్ తెచ్చుకుంది. రేపొద్దున్న ఈ విషయం నా సర్కిల్‌లో తెలిస్తే, క్లబ్‌లో నా పరువేం కావాలి?'' ఎంతసేపు తన గురించి ఆలోచనే తప్పించి, తన కూతురు ఆపని చేయడానికి పురికొల్పిన పరిస్థితి గురించి మాత్రం ఆమె ఆలోచించటం లేదు. అపాటికి వెక్కుతూ నాయనమ్మ కొంగు పట్టుకుని, వెనకగా నక్కి నక్కి, తల్లివంక భయంగా చూస్తోంది చిట్టి లయ.

''అవునే, అది కాపీ కొట్టింది. మరి మనం చేస్తున్నదీ అదే. మిసెస్ రావ్, జుట్టు కత్తిరించుకుందని, నువ్వు చారెడు జడని, మూరెడు చేశావ్. మిసెస్ మాధురీ చేతుల్లేని బ్లౌజ్ వేసిందని, నువ్వూ మొదలెట్టావు. అలా పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లు నువ్వూ, మీ ఆయనా నాగరికత పేరుతో నలుగురిని చూసి పాటిస్తూ, మీపాటికి మీరు ఆనందంగా జీవితం గడిపేస్తున్నారు. ఇంకా ఏడేళ్ళు కూడా నిండని ఆ పసికందుని పట్టుకుని కొడ్తున్నావు. పిల్లలను కనగానే సరికాదు, వాళ్ళను పెంచడంలో శ్రద్ధ ఉండాలి. ఎప్పుడూ క్లబ్బులు, మీటింగ్‌లు అంటూ నువ్వూ, మీ ఆయనా ఇంటిని వదిలేసి తిరిగితే పిల్లను ఎవరు పట్టించుకుంటారు? ఇవాళ చూడు ఏమైందో, అదే ఆర్జ్యూ, నువ్వు దాని ఇంట్రెస్ట్‌ను గమనించి, నాలుగు ముక్కలు చెబితే, ప్రైజ్ వచ్చినా, రాకపోయినా, అది నిజాయితీగా కథ వ్రాసేదికదా! అమ్మ పెట్టా పెట్టదు, అడుక్కు తిననివ్వదు అన్నట్టు దాని బాగోగులు చూడకుండా, మీ సరదాలు తీర్చుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు. ప్రేమ, ఆప్యాయత, అనురాగం అంటే అర్థం తెలియకుండా పెంచుతున్నారు ఆ పిల్లని. ముందు ముందు మీరే నష్టపోతారు'' మనవరాలిని తీసుకుని కోడలి సమాధానం కోసం ఆగకుండా వెళ్ళిపోయిందావిడ.

కావ్య ఆవిడ వెళ్ళినవైపే ఉక్రోషంగా చూసింది. కారణం తనని వేలెత్తి చూపించిందని. ఆమెకు వళ్ళంతా మంటగా ఉంది. భర్త రాగానే, నచ్చజెప్పి లయను బోర్డింగ్ స్కూల్లో వేయాలని నిశ్చయించుకుంది. కానీ గుమ్మం ప్రక్కనే ఉన్న ప్రవీణ్ అంతా విన్నాడని, తల్లి మాటలు అతనిలో వివేకాన్ని నిద్రలేపాయని, పాపని ఇకనుంచి చక్కగా తీర్చిదిద్దాలనుకున్నాడని, బెడ్ మీద వాలిపోయి ఆలోచిస్తున్న కావ్యకు తెలీదు.

★